## ‘తెల్లం’ గెలుపునకు సమష్టిగా పనిచేయాలి

### ఎమ్మెల్సీ తాతా మధుసూదన్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

భద్రాచలం, అక్టోబర్ 8: బీఆర్ఎస్ భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు గెలుపునకు కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఎమ్మెల్సీ, పార్టీ భద్రాచలం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి తాతా మధుసూదన్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన భద్రాచలం పట్టణంలో పర్యటించారు. పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలను కలుసుకుని పలు అంశాలపై చర్చించారు. అనంతరం కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు బంధువు ముత్యాల వీరభద్రం గృహంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. ఎమ్మెల్యే వనమాకు సుదీర్ఘమైన రాజకీయ అనుభవం ఉందని, ఆయన భద్రాచలం వాసులకు సుపరిచితుడేనన్నారు. ఎమ్మెల్యే వనమాను అభిమానించేవారంతా వచ్చే ఎన్నికల్లో తెల్లం వెంకట్రావును ఆశీర్వదించాలన్నారు. అనంతరం అక్కడి నుంచి ఎమ్మెల్యే వనమాకు కాల్ చేసి భద్రాచలంలో ‘తెల్లం’ గెలుపునకు పట్టణంలో పర్యటించాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సమావేశంలో బీఆర్ఎస్ భద్రాచలం మండల అధ్యక్షుడు అరికెళ్ల తిరుపతిరావు, నాయకులు తాండ్ర వెంకటరమణారావు, తాళ్లపూడి రమేష్ గౌడ్, చావా లక్ష్మీనారాయణ, మల్లెల లోకేశ్ పాల్గొన్నారు.

## తలసేమియా బాధితుల సంక్షేమానికి కృషి

### రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర



చిన్నారులతో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం సిటీ, అక్టోబర్ 8: తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల సంక్షేమం కోసం కృషి చేస్తానని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఖమ్మం నగరంలోని శ్రీశ్రీశ్రీ హోటల్‌లో ఆదివారం సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియాపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. తలసేమియా బాధితుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి షెల్టర్ ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 260 మంది వ్యాధి బాధితులకు వైద్యపరీక్షలు నిర్వహించేందుకు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డినీ భాగస్వాముడిగా చేస్తానన్నారు. తలసేమియా జాతీయ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జేఎస్ అరోరా మాట్లాడుతూ.. తలసేమియా జన్యుపరమైన వ్యాధి అన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకరాలు పి.అనిత, సంస్థ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

## 13న జాతీస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికలు

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 8: హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 13న జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఏ హఫీజ్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి కరీమ్, సంయుక్త కార్యదర్శి కాశీహుస్సేన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పురుషులకు ఫ్రీ స్టైల్ విభాగంలో 57, 65, 74 కేజీలు, గ్రీకో రోమన్ విభాగంలో 60,87,130 కేజీలు, మహిళల విభాగంలో 53, 57, 68, 76 కేజీల విభాగంలో ఎంపికలు ఉంటాయన్నారు. ఎంపికైన వారిని ఈ నెల 25 నుంచి గోవాలో జరిగే జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు పంపిస్తామన్నారు. క్రీడాకారులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో పోటీలకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు ప్రమాదంలో భద్రాద్రి జిల్లావాసి మృతి

తాడ్వాయి, అక్టోబర్ 8: భద్రాద్రి జిల్లా మణుగూరు మండలం యగ్గడిగూడేనికి చెందిన ఓ వ్యక్తి ఆదివారం ములుగు జిల్లాలోజరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. తెలిసిన వివరాల ప్రకారం.. యగ్గడిగూడేనికి చెందిన సిమిడి సత్యం (35) పనినిమిత్తం ద్విచక్రవాహనంపై ములుగు జిల్లాకు వెళ్లాడు. ఈక్రమంలో వాహనాన్ని తాడ్వాయి మండలం కాటాపురం వద్ద ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహహం ఢీకొట్టింది. ఘటనలో తీవ్రగాయాల పాలైన క్షతగాత్రుడిని స్థానికులు 108లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ములుగు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా సత్యం మృతిచెందాడు.

# నేడు పాలేరు జలాశయం నుంచి రెండో జోన్‌కు సాగు జలాలు విడుదల

### 10 రోజుల పాటు కొనసాగింపు



పాలేరు రిజర్వాయర్

కూసుమంచి, అక్టోబర్ 8: నాగార్జున సాగర్ ఎడమ కాలువపై ఆధారపడి ఉమ్మడి నల్లగొండతోపాటు ఖమ్మం జిల్లాలోని ఆయకట్టు ఆధారపడి ఉన్నది. ప్రస్తుత సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ సమస్య పరిష్కారంపై దృష్టి సారించారు. ఈ మేరకు పంటలకు ఆరుతడులు అందించేందుకు దిగువకు సాగుజలాలను విడుదల చేయాలని ఈఎన్సీ మురళీధర్‌రావును ఆదేశించారు. ఈమేరకు శనివారం నాగార్జున సాగర్ డ్యాం వద్ద స్థానిక ఎమ్మెల్యే నోముల భరత్ సాగునీటిని విడుదల చేశారు. నీటిపారుదలశాఖ అధికారులు తొలిరోజు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. రెండోరోజు ఆదివారం ఉదయం 5,000 క్యూసెక్కులను విడుదల చేశారు. దీనిలో భాగంగా అక్కడి నుంచి పాలేరు జలాశయానికి 800- 1000 క్యూసెక్కుల నీరు చేరే అవకాశం ఉన్నది. ఆ జలాలు రోజుకు 0.5 టీఎంసీల చొప్పున 10 రోజుల పాటు ఆయకట్టుకు పారనున్నాయి. సోమవారం ఖమ్మం జిల్లాలోని ఆయకట్టుకు జలాలు తరలిరానున్నాయి. దీంతో జిల్లాలో విస్తారంగా సాగు చేస్తున్న వరి పంట ఊపిరిపోసుకోనున్నాయి. మరో నెలరోజుల్లో పంట చేతికి అందే సమయంలో పంటకు నీరు అందడం లేదని కలవరపడుతున్న రైతులకు జలాల విడుదల ఊరటనిచ్చింది.

# క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 8: క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. ఇల్లెందులోని ఏరియా గ్రౌండ్‌లో ఆదివారం ఆయన గనులు, వివిధ విభాగాల స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగులు వృత్తితో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. పోటీల్లో ప్రతిభను చాటాలన్నారు. క్రీడలతో శరీర సౌష్ఠవం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం మల్లారపు మల్లయ్య, అధికారులు శ్రీనివాసు, జీవీ మోహన్‌రావు, అంజిరెడ్డి, యూసుఫ్, సాయిస్వరూప్, బాలాజీ పాల్గొన్నారు.

**ఆర్సీవోఏ క్లబ్‌లో..**

రామవరం, అక్టోబర్ 8: సింగరేణి కొత్తగూడెం ఏరియాని ఆర్సీవోఏ క్లబ్‌లో ఆదివారం డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంటల్ స్థాయి ఇండోర్ పోటీలు జరిగాయి. క్రీడాకారులు షటిల్ పోటీల్లో తలపడ్డారు. ఏరియా సీఎంవోఏఐ అధ్యక్షుడు పాలడుగు శ్రీనివాస్ క్రీడాకారులతో మాట్లాడి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ సీహెచ్ సాగర్, గౌస్, ప్రేమ్, సదానందం, అశోక్, సౌజన్య, సుష్మ పాల్గొన్నారు.

## నేటి నుంచి రెండు రైళ్లు రద్దు

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 8: కొత్తగూడెం (భద్రాచలం రోడ్) రైల్వే స్టేషన్ నుంచి బల్లార్ష వెళ్లే ట్రైన్ నంబర్ 17033 (సింగరేణి ఎక్స్‌ప్రెస్) సోమవారం నుంచి ఈనెల 16 వరకు రద్దు చేయనున్నట్లు చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ జేమ్స్‌పాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి భద్రాచలం రోడ్ వచ్చే ట్రైన్ నంబర్ 17034 (సింగరేణి ఎక్స్‌ప్రెస్) రైలును ఈనెల 15 వరకు రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు.

## భార్య కాపురానికి రావడం లేదని..

### మావోయిస్టుల పేరుతో బెదిరింపు కరపత్రం

### భర్తే చేసి ఉంటాడని పోలీసులకు బంధువుల ఫిర్యాదు

టేకులపల్లి, అక్టోబర్ 8: భార్య కాపురానికి రాకపోవడానికి కారణం ఆమె బంధువులని భావించి భర్త వారి ఇంటిఎదుట మావోయిస్టుల పేరుతో నకిలీ కరపత్రాలు వదిలిన ఘటన ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల కేంద్రంలో ఆదివారం వెలుగుచూసింది. ఎస్సై గన్‌రెడ్డి రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. టేకులపల్లికి చెందిన తేజావత్ జంపన్నకు ఇదే గ్రామానికి చెందిన యువతితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలం వీరి వైవాహిక జీవితం బాగానే సాగింది. తర్వాత వారిద్దరి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఈక్రమంలో కొద్దిరోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లి కాపురానికి రావడం లేదు. దీంతో భర్త మనస్తాపానికి గురయ్యాడు. ఈ పరిణామాలన్నింటికీ కారణం భార్య తరపు బంధువులు మంగ్యా, తిరుపతి, గణేషేనని జంపన్న భావించాడు. ఈ మేరకు శనివారం అర్ధరాత్రి వారి ఇంటి ఎదుట నకిలీ మావోయిస్టు కరపత్రాలు వదిలాడు. కరపత్రాల్లో ‘జంపన్న భార్యను కాపురానికి పంపించండి.. లేకపోతే చంపేస్తాం..’ అని రాసి ఉండడంతో మంగ్యా, తిరుపతి, గణేశ్ అలర్ట్ అయ్యారు. జంపన్నే ఈ పని చేసిఉంటాడని భావించి టేకులపల్లి పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జిల్లాస్థాయి చెస్ పోటీలు ప్రారంభం

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 8: నగరంలోని త్రివేణి పాఠశాలలో ఆదివారం చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెస్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన నలుగురు క్రీడాకారులను అండర్-15 విభాగంలో ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిసాని అసోసియేషన్ సెక్రటరీ జ్యోత్స్న తెలిపారు. ఇంటర్నేషనల్ రేటింగ్ ప్లేయర్ గోపికృష్ణ పాల్గొన్నారు.

## సింగరేణి ఆసుపత్రి తనిఖీ

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 8: సింగరేణి ఇల్లెందు ఏరియా పరిధిలోని సంస్థ ఆసుపత్రిని ఆదివారం చీఫ్ మెడికల్ అధికారి సుజాత తనిఖీ చేశారు. ఔట్ పేషెంట్ వివరాలు, వైద్య పరీక్షలపై ఆమె వైద్యులను ఆరా తీశారు. వైద్యులు విధులపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. అనంతరం ఆమెను ఏరియా జీఎం జాన్ ఆనంద్ సన్మానించారు.

# విద్యార్థుల అ‘పూర్వ’ కలయిక



ఒకే వేదికపై 1985-86 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

పాల్వంచ, అక్టోబర్ 8 : పాల్వంచ పట్టణంలోని బొల్లోరుగూడెం ఉన్నత పాఠశాలలో 1985-86 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఒకేచోట కలుసుకున్నారు. ఆనాడు చదువుకున్న 150మంది విద్యార్థులకు 110 మంది హాజరవుకావడం విశేషం. 37 ఏళ్ల తర్వాత అంతా కూడా విదేశాలు, ఇతర రాష్ర్టాలు, ఇతరత్రా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకేచోటకు చేరుకున్నారు. ఆనాటి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాడు చదువు చెప్పిన గురువులు హెచ్ఎం ప్రసాదరావు, రామ్మోహన్‌రావు, ప్రసాద్, బ్రహ్మచారి, సరస్వతి, కోటేశ్వరి, లలిత, గుణసుందరిలను ఘనంగా సత్కరించారు. పూసపాటి సాయికృష్ణ, వీరభద్రం, షేక్ అమీరుద్దీన్, మల్లేశ్వరరావు, వీరయ్య, జి. వీరభద్రం, హరినాథ్, నర్సిరెడ్డి, చక్రధరచారి పాల్గొన్నారు.

## ఉద్యమకారుల డిమాండ్లను మ్యానిఫెస్టోలో చేర్చాలి



ఎంపీ నామాకు వినతి ఇస్తున్న ఉద్యమకారులు

ఖమ్మం, అక్టోబర్ 8: తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమంలో పాల్గొని జైళ్లకు వెళ్లి కేసులు పాలైనా బంగారు తెలంగాణలో కేసీఆర్ బాటలో నడుస్తున్నామని, తమ డిమాండ్లను పార్టీ మ్యానిఫెస్టోలో చేర్చాలని ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌ను ఆదివారం వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ ఉద్యమకారులకు నామినేటెడ్, పార్టీ పదవుల్లో అవకాశం కల్పించాలని, కేసులు అనుభవించి, జైలు జీవితం గడిపిన ప్రతి ఉద్యమకారుడికి పింఛన్, 500 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం కోసం రూ.10 లక్షలు ఆర్థిక సాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పగడాల నరేందర్, రడం సురేశ్ గౌడ్, నందిగామ రాజ్ కుమార్, నాగేశ్వరరావు, సతీశ్, ఉమా శంకర్, సందీప్, పవన్‌కుమార్, రవి, వీరబాబు, నాగేశ్వరరావు, రాజేశ్, నాగుల్ మీరా, అసిఫ్, వసీం ఖాన్, బుర్హాన్, వెంకన్న, రమాదేవి, గ్లోరీ పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత

పాల్వంచ, అక్టోబర్ 8: బస్సులో గంజాయి తరలిస్తున్న నిందితుడిని పాల్వంచ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సిబ్బంది పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ గుర్నాథ్ రాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాలోని మల్కాన్‌గిరి ప్రాంతానికి చెందిన మల్ల పడియామి బస్సులో హైదరాబాద్‌కు తరలిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం పాల్వంచ బస్టాండుకు చేరుకున్నారు. ఎక్సైజ్ తనిఖీలు చేస్తుండగా పడియామి నుంచి 10 కిలోల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1.40 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ సీఐ తెలిపారు. బూర్గంపాడు నుంచి పాల్వంచకు 20 లీటర్ల నాటు సారా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

## రగ్బీ బాల, బాలికల జట్ల ఎంపిక

ఖమ్మం సిటీ, అక్టోబర్ 8: ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్‌జీఎఫ్-17 రగ్బీ బాల, బాలికల జట్లను ఆదివారం నగరంలోని పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 12, 13, 14 తేదీల్లో తొర్రూరులో జరుగనున్న ఎస్‌జీఎఫ్‌యూ- 17రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. రఘునాయక్, సతీశ్, నర్సింహామూర్తి పాల్గొన్నారు.